సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
శనివారం । 10 । జూన్ । 2023



రహదారులు రక్తసిక్తం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందారు. - 8లో



ఆర్టీసీకి సంపూర్ణ సహకారం

టీఎస్ ఆర్టీసీకి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని రవాణా శాఖ వరంగల్ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం తెలిపారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
42.0°/26.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి వేడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు ఎక్కువగా వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రూ. 2.1లక్షల ఆదాయం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం టెండర్లు నిర్వహించగా ఆలయానికి 2.1లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ మహేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెల్‌ఫోన్ భద్రపరిచే హక్కులను జిట్టబోయిన సాయికుమార్ దక్కించుకున్నాడని చెప్పారు. పార్కింగ్ వేలం పాటను అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు ఈఓ తెలిపారు.

మల్హర్‌రావు సేవలు చిరస్మరణీయం



మల్హర్: గ్రామాల అభివృద్ధికి మాజీ ఎంపీపీ బెల్లంకొండ మల్హర్‌రావు చేసిన కృషి మరవలేనిదని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మల్హల్‌రావు 33వ వర్ధంతి సందర్భంగా కొయ్యూర్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి శుక్రవారం పూలమావేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోనె శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ మండల నాయకులు యాదగిరిరావు, తాజుద్దీన్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సిద్ధి లింగమూర్తి, మండల కోఆప్షన్ సభ్యుడు అయ్యూబ్‌ఖాన్, సింగిల్ విండో డైరెక్టర్లు సుంకు రాము, మల్క రాజేశ్వర్‌రావు, మంథని మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సమ్మయ్య నాయక్, రాజేశ్వర్‌రావు, బోయిన రాజయ్య, సర్పంచ్‌లు విజయ నాగేశ్వర్‌రావు, ప్రమీల రాజునాయక్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ సుమన్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో అడ్డదారిలో అనర్హులకు అసిస్టెంట్ కుక్ నియామకాన్ని అందించారని రేగొండ మండలకేంద్రానికి చెందిన మైస రాజేశ్వరి శుక్రవారం కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేజీబీవీలో మార్చిలో అసిస్టెంట్ కుక్ నియామకం కోసం ఉత్తర్వులు జారీచేయగా అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఎంపిక చేసిన వ్యక్తికి కాకుండా మరో వ్యక్తిని నియమించడం సరికాదన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, కలెక్టర్ స్పందించి అసిస్టెంట్ కుక్ అక్రమ నియామకంపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన వారికి అవకాశం కల్పించాలని కోరారు.

కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా వంశీవర్ధన్‌రావు



కాటారం: కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని దేవరాంపల్లికి చెందిన వంశీవర్ధన్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అవినాష్ శుక్రవారం నియామకపు ఉత్తర్వులు జారీచేశా రు. రైతులను ఏకంచేస్తూ రైతు సమస్యలపై కాంగ్రెస్ పార్టీ పక్షాన నిత్యం పోరాడాలని సూ చించారు. వంశీవర్ధన్‌రావును మంథని ఎమ్మె ల్యే, ఏఐసీసీ కార్యదర్శి డి.శ్రీధర్‌బాబు శాలు వాతో సన్మానించి అభినందనలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే శ్రీధర్ బాబుతో పాటు జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులకు వంశీవర్ధన్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

కాటారం: మండలంలో ముగ్గురు పంచాయతీ కార్యదర్శులకు స్థాన చలనం కలిగిస్తూ కలెక్టర్ భవేష్ మిశ్రా శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. కాటారం గ్రామపంచాయతీ కార్యదర్శి ఉమాదేవిని ధన్వాడకు, ప్రతాపగిరి కార్యదర్శి షగీర్‌ఖాన్‌ను కాటారానికి, ధన్వాడ కార్యదర్శి శంకరయ్యను ప్రతాపగిరికి బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

‘ప్రజల సొమ్ము దుర్వినియోగం’

భూపాలపల్లి రూరల్: తెలంగాణ దశాబ్ది సంబరాల పేరుతో ప్రజల సొమ్మును బీఆర్‌ఎస్ ప్రభుత్వం, నాయకులు దుర్వినియోగం చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యుగేందర్ ఆరోపించారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు గొర్రె శశికుమార్‌తో కలిసి యుగేందర్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక కూడా యువత జీవితాల్లో మార్పు రాలేదన్నారు. నిరుద్యోగులు, రైతులు బీఆర్‌ఎస్ నాయకుల మోసపూరిత మాటలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, గాలిఫ్, రాంప్రసాద్, మహేష్, రంజిత్ భగవాన్, మధుకర్, రాకేష్, శంకర్ పాల్గొన్నారు.

బేస్‌మెంట్ లెవల్‌లోనే మరుగుదొడ్లు



తాడిచర్ల పాఠశాలలో నిలిచి పోయిన మరుగుదొడ్ల నిర్మాణం

మల్హర్ మండల కేంద్రం తాడిచర్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 228మంది విద్యార్థులు ఉన్నారు. రూ.57లక్షల నిధులతో డైనింగ్ హాల్, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్‌ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. వీటిలో 45శాతం పనులు మాత్రమే పూర్తిచేశారు. ప్రధానంగా మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో బాలికలు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. మరుగుదొడ్లు ఇంకా బేస్‌మెంట్ లెవల్‌లోనే నిలిచిపోయాయి.

ఆగిపోయిన తరగతి గదుల నిర్మాణ పనులు



చిట్యాలలో ఆగిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణం

చిట్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 108మంది విద్యార్థులు ఉన్నారు. రూ.34.30లక్షల నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను చేపడుతున్నారు. మూడు నెలల క్రితం నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

సాక్షి పరిశీలన

పైసల్లేక.. పనులు సాగక..

నత్తనడకన ‘మన ఊరు-మన బడి’ పనులు

- ఏడాది గడిచినా తొలి విడతే పూర్తి కాలేదు..
- సోమవారం నుంచి విద్యాసంవత్సరం ప్రారంభం
- రెండో విడత ఇంకెప్పుడో?

భూపాలపల్లి అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు - మన బడి పనులకు నిధుల సమస్య అడ్డంకిగా మారింది. పనులు ప్రారంభించి ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు పూర్తికాలేదు. సోమవారం నుంచి విద్యాసంవత్సరం పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు. పనులను పూర్తిచేయడంపై అధికారులు, పాలకులు దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది. జిల్లావ్యాప్తంగా సాగుతున్న మన ఊరు- మన బడి పనులను శుక్రవారం సాక్షి బృందం పరిశీలించింది.

జిల్లాలో 432 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మన ఊరు-మన బడి కార్యక్రమంలో జిల్లాలో తొలి విడతగా 149 పాఠశాలలను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన 149 పాఠశాలలు కూడా గ్రామీణ ప్రాంతానికి చెందినవే. పనులను ఏడు మండలాలను పంచాయతీ రాజ్ శాఖకు, 3 మూడు మండలాలకు టీఎస్‌డబ్ల్యూఐడీసీ, ఒక మండలం ట్రైబల్ వెల్ఫేర్ విభాగాలకు అప్పగించారు. ఈ కార్యక్రమం ద్వారా రూ.30 లక్షల లోపు అంచనాలతో 141 పాఠశాలల్లో చేపట్టిన పనులను ఎస్‌ఎంసీలకు అప్పగించగా రూ.30లక్షలపైగా ఉన్న ఎనిమిది పాఠశాలలను ఇంజనీరింగ్ శాఖలకు టెండర్ ద్వారా పనులను అప్పగించారు.



గొల్లబుద్దారం పాఠశాలలో నిలిచిన డైనింగ్‌హాల్ నిర్మాణం

నిలిచిపోయిన కిచెన్ షెడ్లు..

భూపాలపల్లి మండలం గొల్లబుద్దారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో 300 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో కిచెన్ షెడ్, డైనింగ్ హాల్ పనులను గతేడాది క్రితం ప్రారంభించినా ఇప్పటి వరకు పూర్తి చేయలేదు. కిచెన్ షెడ్లకు ప్లాస్టింగ్ చేయకుండా అసంపూర్తిగా నిలిచిపోయాయి. డైనిగ్ హాల్‌కు పిల్లర్లు నిర్మించి టకప్పు వేయడం లేదు.

బిల్లులు ఆగి.. పనులకు బ్రేక్..

జిల్లాలో రూ.22.80కోట్లతో అదనపు తరగతులు, మేజర్, మైనర్ మరమ్మతులు, డైనింగ్‌హాల్, ఎలక్ట్రికల్ పనులు.. రూ 18.60కోట్లతో ఉపాధి పనుల్లో కిచెన్, కాంపౌండ్ వాల్, మరుగుదొడ్లు.. రూ. 7.34కోట్లతో పెయిటింగ్.. రూ.1.35కోట్లతో ఫర్నిచర్, రూ.90లక్షలు గ్రీన్ బోర్డులకు నిధులు కేటాయించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో చేపట్టిన పనులకు రూ. 18 కోట్లు చెల్లించాలని ప్రభుత్వానికి సూచించగా ఇప్పటివరకు రూ.16.25కోట్లు చెల్లించారు. పనులు పూర్తి చేసి ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి రిపోర్టు చేసినా కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు పూర్తిస్థాయిలో జరగలేదు. ఇంకా ఇంజనీరింగ్ అధికారులు రికార్డు చేయని పనుల సంఖ్య వందల్లో ఉండగా, అంచనాల విలువ రూ.కోట్లలో ఉన్నట్లు తెలుస్తుంది. బిల్లుల చెల్లింపులు సక్రమంగా జరగకపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. ఇలాంటి పరిస్థితుల వల్లే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా చేపట్టాల్సిన పనులు పూర్తి చేయకపోవడం లేదు.

పనుల్లో జాప్యాన్ని నివారిస్తాం..



‘మన ఊరు-మన బడి’ పనుల్లో జాప్యాన్ని నివారిస్తాం. రూ.30 లక్షల పైచిలుకు అంచనాలతో రూపొందించిన పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. మన ఊరు-మన బడికి సంబంధించి నిధుల కొరత లేదు. పూర్తయిన పనులకు వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తున్నాం. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అన్ని పూర్తి పనులు పూర్తి చేయించేలా ఆదేశాలు జారీ చేశాం.

- రాంకుమార్, ఇన్‌చార్జ్ డీఈఓ

ఎస్పీగా పదోన్నతి



శ్రీనివాసులు

భూపాలపల్లి: అదనపు ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న వి.శ్రీనివాసులుకు ఎస్పీగా పదోన్నతి లభించింది. ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2019 నవంబర్ 1న అదనపు ఎస్పీగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు విశేష కృషిచేశారు. 2020, 2022 సంవత్సరాల్లో జరిగిన మేడారం జాతరలో సమర్థవంతంగా పనిచేశారు. ఎస్పీగా పదోన్నతి పొందిన శ్రీనివాసులును ఎస్పీ సురేందర్‌రెడ్డి అభినందించారు.

పీహెచ్‌డీ దరఖాస్తుల స్క్రూటినీ షురూ

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని సైన్స్, సోషల్ సైన్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్, లా, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఆర్ట్స్ విభాగాల పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షరాసి అర్హత సాధించిన అభ్యర్థులు ఇప్పటికే సంబంధిత డీన్లకు దరఖాస్తు చేసిన విషయం విదితమే. ఆయా దరఖాస్తులను స్క్రూటినీ చేసే ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. సైన్స్ డీన్ మల్లారెడ్డి సంబంధిత విభాగాల అధిపతులకు దరఖాస్తులను పంపగా స్క్రూటినీ చేస్తున్నారని సమాచారం. మిగిలిన విభాగాల డీన్లు కూడా ఈ ప్రక్రియ చేపట్టనున్నారని తెలిసింది.

19నుంచి నిట్‌లో జోసా అడ్మిషన్లు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో మొదటి సంవత్సరంలోకి ప్రవేశానికి గాను జోసా ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 19 నుంచి ప్రారంభం కానుంది. జేఈఈ మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు జోసా (జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ)ద్వారా బీటెక్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు. దేశావ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీలు, 31 ఎన్‌ఐటీలు, ఐఐఐటీ, జీఎఫ్‌టీఐలలో ప్రవేశాలకు ఈనెల 19 నుంచి ఆన్‌లైన్ ద్వారా చాయిస్ ఫిల్లింగ్‌ను ప్రారంభిస్తారు. ఈనెల 19 నుంచి జూలై 31వరకు జోసా అడ్మిషన్లు కొనసాగనున్నాయి.

ప్రభుత్వ పాఠశాలలు ప్రగతికి మెట్లు



బడిబాటలో శనిగరపు భద్రయ్య, ఉపాధ్యాయులు

చిట్యాల: ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల ప్రగతికి మెట్లు లాంటివని డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీ శనిగరపు భద్రయ్య అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో జిల్లా ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పించిందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించేలా శ్రద్ధ చూపాలని చెప్పారు. చదువు ఎవరి సొత్తు కాదని.. విజ్ఞానాన్ని పెంపొందిస్తుందన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని క్రమశిక్షణతో ఉంటే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని చెప్పారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సదయ్య, శంకర్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పండుగలా కవి సమ్మేళనం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దివాకర

గణపురం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈ నెల 11న కోటగుళ్లలో నిర్వహించే కవి సమ్మేళనం కార్యక్రమం పండుగలా నిర్వహించాలని అదనపు కలెక్టర్ దివాకర అన్నారు. కవి సమ్మేళన కార్యక్రమ ఏర్పాట్లపై శుక్రవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం నిర్వహించే ఈ సమావేశానికి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కోటగుళ్లలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, డీపీఆర్‌ఓ శ్రీధర్, సీపీఓ సామ్యూల్, డీపీఓ ఆశాలత, జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా సంక్షేమ పథకాలు

కలెక్టర్ భవేష్ మిశ్రా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తుందని కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం భూపాలపల్లిలోని ఏఎస్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన సంక్షేమ సంబరాలలో కలెక్టర్ భవేష్‌మిశ్రా, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్‌మిశ్రా మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం 100కు పైగా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. రైతు బంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, గొర్రెల పంపిణీ, చేపల పెంపకం వంటి అనేక పథకాలు ఏ రాష్ట్రంలో అమలు చేయకపోయినప్పటికీ ప్రజల కోసం సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలలో మానవీయ కోణం ఉంటుందన్నారు. కేసీఆర్ కిట్ పథకం వల్ల మాతా శిశు మరణాలు గణనీయంగా తగ్గిపోయాయని, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా బాల్యవివాహాలు ఆగిపోయాయని చెప్పారు. రెసిడెన్షియల్ గురుకులాల ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య పౌష్టికాహారం అందుతున్నాయని తెలిపారు. బీసీ కులవృత్తులకు, చేతి వృత్తులకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం కోసం జూన్ 20వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపికచేసి అందిస్తామన్నారు.

ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రం నంబర్‌వన్‌గా నిలుస్తుందన్నారు. భూపాలపల్లిలో వైద్య కళాశాల ఏర్పాటు చేస్తున్నామని, 50 పడకల క్రిటికల్ యూనిట్‌ను కూడా మంజూరు చేసుకున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే 100మంది లబ్ధిదారులకు, దళిత బంధు పథకం కింద రూ.10కోట్ల నిధులు అందించామని, మరో 1100 మంది లబ్ధిదారులకు త్వరలో పంపిణీ చేస్తామన్నారు. జూన్ మాసాంతంలో పోడు పట్టాల పంపిణీ, జూలై మాసంలో గృహ లక్ష్మి అమలు చేస్తామని తెలిపారు.



చెక్కులు పంపిణీచేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే



లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే

అనంతరం రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం కింద 18 యూనిట్లు, బీసీ కులవృత్తులు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి సిద్దు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభభ డీఆర్‌డీఓ పురుషోత్తం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్ గౌడ్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- పరీక్ష కేంద్రాలు 9, అభ్యర్థులు 2369
- కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి: ఈ నెల 11న జిల్లాలో నిర్వహించనున్న గ్రూప్ 1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ భవేష్ మిశ్రా వెల్లడించారు. భూపాలపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు ఎటువంటి పొరపాట్లు జరుగకుండా గ్రూప్ 1 పరీక్షను ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్ మానిటరింగ్ చేసే విధంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2,369మంది పరీక్షకు హాజరు కానున్నారని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లోని అభ్యర్థులకు అసౌకర్యాలు కలుగకుండా ప్రతీ రూంలో ఫ్యాన్లు తిరిగే విధంగా, సరైన బల్లలు, లైటింగ్ సక్రమంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాలలో దివ్యాంగుల కోసం సౌకర్యాలు కల్పించాలని, స్ట్రాంగ్ రూం నుంచి పరీక్షా కేంద్రానికి తిరిగి పరీక్షా కేంద్రం నుంచి రిసెప్షన్ సెంటర్‌కు తరలించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. రూట్ అధికారులు పరీక్షా మెటీరియల్‌ను స్ట్రాంగ్ రూం నుంచి పోలీసు బందోబస్తుతో తీసుకెళ్లి పరీక్షా కేంద్రాల్లోని లైజనింగ్ అధికారులకు అందజేయాలన్నారు. పరీక్ష అనంతరం కలెక్టరేట్‌లోని రిసెప్షన్ సెంటర్‌లో టీఎస్‌పీఎస్సీ అధికారులకు అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ టీఎస్ దివాకర, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, అదనపు ఎస్పీ వి.శ్రీనివాసులు, ఆర్డీఓ శ్రీనివాస్, కళాశాలల ప్రిన్సిపల్‌లు, చీఫ్ సూపరింటెండెంట్‌లు, లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.



అసిస్టెంట్ ప్రొఫెసర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా



సూచనలు ఇస్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

వైద్య కళాశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలి

వైద్య ప్రొఫెసర్లు అంకితభావంతో పనిచేసి భూపాలపల్లి వైద్య కళాశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. భూపాలపల్లి మెడికల్ కళాశాలకు కేటాయించబడిన అసిస్టెంట్ అసోసియేషన్ ప్రొఫెసర్లు శుక్రవారం కలెక్టర్‌ను కలిశారు. నూతనంగా ఎంపికైన వైద్యులను పరిచయం చేసుకున్న కలెక్టర్, వారి అనుభవం, విద్యార్హత, స్పెషలైజేషన్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. భూపాలపల్లి జిల్లా వెనుకబడిన ప్రాంతం, బోర్డర్ జిల్లాగా ఉన్నదని, ఇక్కడ వసతులు చాలా తక్కువగా ఉంటాయని, అయినా నూతనంగా నిర్మించిన సింగరేణి క్వార్టర్‌లో మంచి వసతి ఏర్పాటు చేశామన్నారు. నూతన విద్యార్థులకు మంచి నాణ్యమైన వైద్య విద్యను అందించాలని, ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకరావాలన్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, విద్యార్థులకు మంచి విద్య అందించాలని కోరారు. ఈ సమావేశంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజు దేవుడే, డాక్టర్ నాగార్జునరెడ్డి, డాక్టర్ జీడి తిరుపతి, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

● పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్



షాపు యజమాని అరెస్టును చూపిస్తున్న టాస్క్‌ఫోర్స్, ఇంతేజార్‌గంజ్ పోలీసులు

వరంగల్ చౌరస్తా : దుకాణాదారులు విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. సీపీ ఆదేశాల మేరకు వరంగల్ స్టేషన్ రోడ్డులోని ఫర్టిలైజర్ షాపుల్లో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి నేతృత్వంలో పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. ఏంఎస్ మల్లికార్జున దుకాణంలో సదానంద్ బీజీ–2 పత్తి విత్తనాలను ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు వెల్లడైంది. ఒక ప్యాకెట్ అసలు ధర రూ.853 కాగా.. రెండు ప్యాకెట్లను రూ.2100 అమ్ముతున్నారు. విత్తనాలు, పురుగు మందులను ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని పోలీసులు తెలిపారు. కాగా, మరో రకం పత్తివిత్తన ప్యాకెట్ అసలు ధర రూ.853 ఉండగా రెండు ప్యాకెట్లను రూ.2100కి అమ్ముతున్నారు. విత్తనాలను స్వాధీనం చేసుకుని, షాపు యజమాని అక్కల మల్లికార్జున్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విత్తనాలను అమ్మాలని సీపీ సూచించారు.

ముగ్గురికి గ్రేడ్-3 కార్యదర్శులుగా పదోన్నతి

వరంగల్ : ముగ్గురు అసిస్టెంట్ సెక్రటరీలకు గ్రేడ్–3 కార్యదర్శులుగా పదోన్నతి కల్పించి, బదిలీ చేస్తూ రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ జి. లక్ష్మిబాయి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో అసిస్టెంట్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్న జె. భాస్కర్‌కు గ్రేడ్–3 పదోన్నతి కల్పించి జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మార్కెట్‌కు బదిలీ చేశారు. ఎ. షరీఫ్‌కు గ్రేడ్–3గా ఇక్కడి నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మార్కెట్‌కు బదిలీ చేశారు. ఇక్కడే పనిచేస్తున్న ఎస్.శ్రీనివాస్‌కు గ్రేడ్ –3గా పదోన్నతి కల్పించి జనగామ మార్కెట్ కమిటీకి బదిలీ చేశారు.

మణుగూరు టు బెల్గావి ప్రత్యేక రైలు పునఃప్రారంభం

కాశిబుగ్గ: మూడో రైల్వే లైన్ పనులతో ఇటీవల నిలిపివేసిన మణుగూరు బెల్గావి ప్రత్యేక రైలు ఆదివారం సికింద్రాబాద్ నుంచి మణుగూరుకు పునఃప్రారంభిస్తున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రైలు(07335) 11న ఉదయం 5.25కు సికింద్రాబాద్‌లో ప్రారంభమై భువనగిరి, జనగామ, కాజీపేట, వరంగల్‌కు 7.58 గంటలకు చేరుకుని కేసముద్రం, మహబూబాబాద్, డోర్నకల్, గాంధీపురం, భద్రాచలం రోడ్డు స్టేషన్‌లలో ఆగుతూ 12.50 గంటలకు మణుగూరుకు చేరుకుంటుంది. 12న 07336 రైలు మణుగూరులో 3.40 గంటలకు ప్రారంభమై స్టేషన్‌లలో ఆగుతూ వరంగల్‌కు 7.28, సికింద్రాబాద్‌కు 10.10 గంటలకు చేరుకుంటుదని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

తల్లిని చూడడానికి వస్తూ అనంతలోకాలకు..

● ఆగి ఉన్న లారీ కిందికి దూసుకెళ్లిన బైక్.
● అక్కడికక్కడే అన్నాచెల్లెలు మృతి



లారీకింద ఇరుక్కుపోయిన సుజిత్‌రెడ్డి,పూజితారెడ్డి


హసన్‌పర్తి : రెండు రోజులు సెలవులు ఉండడంతో తల్లిని చూడడానికి స్వగ్రామానికి వస్తున్న అన్నా చెల్లెలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. హసన్‌పర్తి మండలం నాగారం గ్రామానికి చెందిన పోరెడ్డి సుజాత– దేవేందర్‌రెడ్డి దంపతులకు కుమారుడు సుజిత్‌రెడ్డి (27), పూజితారెడ్డి(24) ఉన్నారు. పూజితారెడ్డి హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తుండగా, సుజిత్ ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శని, ఆదివారాల్లో సెలవులు ఉండడంతో తల్లిని చూడడానికి బైక్‌పై నాగారం వస్తున్నారు.ఈ క్రమంలో బైక్.. ధర్మసాగర్ మండలం కరుణాపురం వద్ద ప్రధాన రహదారిపై నిలిపి ఉన్న లారీ కిందికి దూసుకెళ్లింది. దీంతో వారు అక్కడిక్కడే ప్రాణాలు వదిలారు.

అనాథ అయిన తల్లి.

కాగా, కొడుకు, కూతురు మృతి చెందడం, అంతకుముందే భర్తను కోల్పోవడంతో ప్రస్తుతం ఆ తల్లి అనాథ అయింది. కష్టాలు తీరుతాయని సంతోష పడిన తల్లికి మరిన్ని కష్టాలు తోడయ్యాయి. కొడుకు, కూతురు మృతదేహాలపై ఆ తల్లి పడి ఏడుస్తుండగా, అక్కడ ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమయ్యారు.

రహదారులు రక్తసిక్తం..

రహదారులు రక్తసిక్తమయ్యాయి.. శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలుచోట్ల జరిగిన రోడ్డు ప్రమాదంలో 7 గురు మృతి చెందారు. ధర్మసాగర్ మండలం కరుణాపురం వద్ద బైక్.. లారీ కిందికి దూసూకెళ్లిన ఘటనలో అన్నాచెల్లెలు, మరిపెడ మండలం కోమటికుందా తండా సమీపంలో లారీని బైక్ ఢీకొనడంతో నవదంపతులు, మహాముత్తారం మండలం కొర్లకుంట గ్రామంలో బైక్.. ట్రాలీ ఆటోను ఢీకొనడంతో బైక్‌పై ఉన్న వ్యక్తితోపాటు ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే, పర్వతగిరి మండలం వడ్లకొండ వద్ద బైక్.. మట్టిదిబ్బను ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.



మట్టిదిబ్బను ఢీకొని..



రాజు మృతదేహం

పర్వతగిరి : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వడ్లకొండ, ఉప్పరపల్లి గ్రామాల మధ్యలో జరిగింది. ఎస్సై దేవేందర్ కథనం ప్రకారం వడ్లకొండకు చెందిన తాటికాయల రాజు కుటుంబ సభ్యులతో కలిసి అనంతారంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. గురువారం రాత్రి పని నిమిత్తం వడ్లకొండకు ద్విచక్రవాహనంపై వెళ్లాడు. అనంతరం రాజు ఎంతకూ ఇంటికి రాలేదు. దీంతో అతని తమ్ముడు నవీన్, కొడుకు రవితేజ.. రాజు ఆచూకీ కోసం బయలుదేరారు. ఈ క్రమంలో వడ్లకొండ, ఉప్పరపల్లికి దారిలో రోడ్డు పక్కన ఉన్న మట్టి దిబ్బను గుద్దుకుని కిందపడి ఉన్నాడు. గమనించిన వారు వెంటనే 108కు సమాచారం ఇవ్వగా అప్పటికే రాజు మృతి చెందాడు. దీనిపై మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాలీ ఆటో, బైక్ ఢీ..

● ఇద్దరి మృత్యువాత




సమ్మక్క, అశోక్ మృతదేహాలు

మహాముత్తారం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని కొర్లకుంటలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని కొర్లకుంట గ్రామానికి చెందిన చేరాల అశోక్ ద్విచక్ర వాహనంపై మహాముత్తారం నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామశివారులోని అలుగు వాగు సమీపంలో గోదావరిఖని నుంచి మంగోపేటకు వెళ్తున్న ట్రాలీ ఆటోను ఎదురుగా ఢీకొన్నాడు. దీంతో ట్రాలీ ఆటోలో ముందు భాగంలో కూర్చున్న చిల్ల సమ్మక్కతో పాటు అశోక్ అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న కాటారం సీఐ రంజిత్‌రావు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను మహాదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు చిల్ల పోశాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దార్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పెళ్లయిన మూడు నెలలకే కబళించిన మృత్యువు..




నారాయణ సింగ్,అంజలి మృతదేహాలు

● బైక్, లారీ ఢీ
● దంపతులు మృతి

మరిపెడ రూరల్ : లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో నవ దంపతులు అక్కడి అక్కడే మృతి చెందారు. కాగా, పెళ్లయిన మూడు నెలలకే దంపతులను లారీ రూపంలో మృత్యువు కబలించింది. దీంతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మరిపెడ మండల కేంద్రం పూలబజార్‌కు చెందిన అంజలి (21)కి జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చెల్లగరిగెకు చెందిన తునగర్ నారాయణసింగ్ (23)కు గత మార్చి 9న వివాహం జరిగింది. నారాయణ సింగ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో వీకెండ్ కావడంతో దంపతులు బైక్‌పై అత్తగారింటికి వస్తుండగా మరిపెడ మండలం కోమటికుంటతండా సమీపంలో ఎదురుగా హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీని బైక్ ఢీకొంది. ఈ ఘటనలో దంపతులు అక్కడిక్కడే మృతి చెందారు.

'ఆ బాలిక ఖరీదు రూ.13 లక్షల'పై ఎఫ్ఐఆర్

● మధ్యవర్తిత్వం చేసిన 12 మందిపై కేసు నమోదు



సాక్షి, వరంగల్: 'ఆ బాలిక ఖరీదు రూ.13 లక్షలు' శీర్షిన సాక్షి ప్రధాన సంచికలో ఈ నెల 6వ తేదీన ప్రచురితమైన కథనాన్ని తీవ్రంగా పరిగణించిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. పోక్సో కేసు నీరుగార్చేలా మధ్యవర్తిత్వం చేసిన 12 మంది పెద్దలపై 195 (ఏ) రెడ్‌విత్ 34 ఐపీసీ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. ఓ బాలికను నర్సంపేటకు చెందిన యువకుడు ప్రేమపేరుతో మోసం చేయడంతో అతనిపై 2022 ఆగస్టు 14న నమోదైన పోక్సో కేసు కోర్టులో కొట్టుడుపోయే విధంగా సహకరించాలంటూ పెద్దలు ఒత్తిడి తీసుకురావడంతో ఇష్టం లేని బాధితురాలు సీపీ రంగనాథ్‌ను గత గురువారం మరోమారు కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేసింది. అప్పటికే సాక్షిలో వచ్చిన కథనంతో మధ్యవర్తుల వివరాలు సేకరించిన ప్రత్యేక ఎస్‌బీ బృందం సీపీ కార్యాలయానికి తీసుకొచ్చి మరీ విచారించారు. ఈశ్వర్ సింగ్, అనిల్, మందకుమార్, జైపాల్‌రెడ్డి, నల్ల మనోహర్‌రెడ్డి, చందన, నిరంజన్‌రెడ్డి, సూరయ్య, చల్లామల్లారెడ్డి, శారద, కొమ్మాలు, లక్‌పతిలపై నర్సంపేట టౌన్ పీఎస్‌లో కేసు నమోదు చేశారు. ఇందులో పోలీసుల ప్రమేయం ఉందా, ఉంటే ఎవరూ ఉన్నారనే దిశగానూ ఎస్బీ బృందాలు ఇప్పటికే విచారణ ముమ్మరం చేసినట్టు తెలిసింది.

నర్సంపేట ఏసీపీ ఆఫీసు ఎదురుగానే పంచాయితీ



నర్సంపేట పట్టణానికి చెందిన ఓ యువకుడు.. ఓ తండాకు చెందిన 16 ఏళ్ల బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించాడు. ఆ తర్వాత మొహం చాటేయడంతో మోసపోయానని తెలుసుకున్న సదరు బాలిక ఇచ్చిన ఫిర్యాదుతో యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. ఈ వివాదాన్ని పెద్దల ముందు తీసుకెళితే పరిహారం ఇవ్వాలని నర్సంపేట ఏసీపీ ఆఫీసుకు ఎదురుగా ఉన్న ఎంపీడీఓ ఆఫీసులో జరిగిన పంచాయితీలో నిర్ణయించి రూ.13లక్షలకు తీర్మానం చేశారు. రూ.ఐదు లక్షలు తల్లి శారదకు ఇచ్చి అదే నగదును నర్సంపేటలోని డీసీసీ బ్యాంక్ బ్రాంచ్‌లో చందన, మల్లారెడ్డి పేర్ల మీద ఉన్న జాయింట్ అకౌంట్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఫిర్యాదురాలు డబ్బు తీసుకునేందుకు సుముఖంగా లేకపోవడంతో కోర్టు ద్వారా తనకు న్యాయం జరుగుతుందని భావించిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

తెలంగాణ అభివృద్ధే కేసీఆర్ లక్ష్యం..



మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

● రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి: తెలంగాణను అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం మండలంలోని కిష్టాపురం క్రాస్‌లోని వీఆర్‌గార్డెన్‌లో నిర్వహించిన తెలంగాణ సంక్షేమ సంబురాల్లో మంత్రి పాల్గొని మాట్లాడారు. 'ప్రతీ ఇంట్లో సంక్షేమం.. ప్రతీ ముఖంలో సంతోషం' అనే కోణంలో సీఎం కేసీఆర్ పని చేస్తున్నట్లు చెప్పారు. రూ. 60వేల కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్‌కు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అన్నారు. రాష్ట్రం ఏర్పడిన పదేళ్లలోనే తెలంగాణ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి, గొర్రెల పంపిణీ చెక్కులు, బీసీ కులాలకు రూ.లక్ష చెక్కులను అందించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీవాత్స కోట, డీఆర్‌డీఓ పీడీ సంపత్‌రావు, ఎంపీపీ జినుగు అని మిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ కిషన్, బిల్లా సుధీర్‌రెడ్డి, నర్సింహానాయక్, పూస మధు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి సంపూర్ణ సహకారం

● రవాణా శాఖ ఉప కమిషనర్ పురుషోత్తం



విలేజ్ బస్ ఆఫీసర్స్ మార్గదర్శకాల బుక్‌ను ఆవిష్కరిస్తున్న డీటీసీ, ఏసీపీ, ఆర్ఎం

హన్మకొండ: టీఎస్ ఆర్టీసీకి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని రవాణా శాఖ వరంగల్ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం అన్నారు. శుక్రవారం హనుమకొండ బస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విలేజ్ బస్ ఆఫీసర్స్ విధులను ఏసీపీ కిరణ్ కుమార్, ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం జె.శ్రీలతతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విలేజ్ బస్ ఆఫీసర్స్ నియామకంతో సంస్థకు మేలు చేకూరుతుందన్నారు. ఏసీపీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు కృపాకర్ రెడ్డి, మాధవరావు, డీఎంలు జి.సురేశ్, బాబు నాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో నర్సంపేట

● మంత్రి సత్యవతిరాథోడ్



మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్

నర్సంపేట: సీఎం కేసీఆర్, మంత్రుల సహకారంతో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నర్సంపేటను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతున్నారని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంక్షేమ సంబురాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నర్సంపేట ప్రాంతం సాగునీటితో సస్యశ్యామలంగా మారిందన్నారు. నర్సంపేట అభివృద్ధిలో తనవంతు సహకారం అందిస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే పెద్ది మాట్లాడుతూ ఇరిగేషన్ సర్క్యూట్ నర్సంపేటకు జలహారం అన్నారు. నర్సంపేట దిక్కులా రెండు పంటలకు సరిపడా సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ గతంలో పది వేల మంది లబ్ధిదారులకు రూ.135కోట్లతో గొర్రెల పంపిణీ చేశామని, మిగితా వారికి త్వరలో రెండో దఫా అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఓడీసీఎంఎస్ రామస్వామి, ఆర్టీఓ శ్రీనివాసులు, ఆర్‌బీఎస్ రాష్ట్ర బాధ్యులు రాయిడి రవీందర్‌రెడ్డి, ఏసీపీ సంపత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రివర్స్ వస్తూ బావిలో పడిన ట్రాక్టర్..


● డ్రైవర్ దుర్మరణం
● లింగాపురం అలుముకున్న విషాదఛాయలు



కీమ (ఫైల్)

చెన్నారావుపేట: ట్రాక్టర్‌ను రివర్స్ తీస్తున్న క్రమంలో బావిలో పడి డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని లింగాపురంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం లింగాపురం శివారు మేఘ్యా తండాకు చెందిన అజ్మీరా కీమ (45) అదే తండాకు చెందిన అజ్మీరా శ్రీను ట్రాక్టర్‌ను తీసుకుని బానోత్ రవి అనే కౌలు రైతుకు చెందిన చెలక దున్నడానికి శుక్రవారం తెల్లవారుజామున వెళ్లాడు. చెలక దున్నతున్న క్రమంలో రివర్స్ తీస్తూ వ్యవసాయ బావిలో ట్రాక్టర్‌తో పడ్డాడు. దీంతో కీమ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై తోట మహేందర్ ఘటనా స్థలికి చేరుకుని బావి నుంచి మృతదేహాన్ని బయటికి తీయించారు.అనంతరం పోస్ట్‌మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీనిపై మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


వడదెబ్బతో రైతు మృతి



లక్ష్మీనారాయణ (ఫైల్)

ఆత్మకూరు : వడదెబ్బతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని పెద్దాపూర్‌లో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన గోపిరెడ్డి లక్ష్మీనారాయణ (65)కు మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిలో మొక్కజొన్న సొప్ప శుభ్రం చేస్తుండగా వడదెబ్బతో తీవ్ర అస్వస్థకు గురై ఒకసారిగా కుప్పకూలి మృతి చెందాడు. కాగా, మృతుడి కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

కొత్తదుబ్బతండాలో ..



హేమ్లా(ఫైల్)

డోర్నకల్: వడదెబ్బతో మండలంలోని కొత్తదుబ్బతండాకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. తండాకు చెందిన ధారావత్ హేమ్లా(83) శుక్రవారం మున్నేరువాగు వద్దకు మేకలను మేతకు తీసుకెళ్లాడు. మండుతున్న ఎండకు అస్వస్థతకు గురై వాగు సమీపంలోనే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

పేరుకు కౌలు.. చేసేది నకిలీ విత్తన దందా..



● పల్నాడు టు కామారెడ్డిగూడెం..
● నకిలీ విత్తనాలను పట్టుకున్న వ్యవసాయ అధికారులు
● పోలీసులకు అప్పగింత



కామారెడ్డిగూడెంలో నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్న వ్యవసాయ అధికారులు

దేవరుప్పుల: వ్యవసాయ భూముల కౌలు పేరిట వలస వచ్చిన ఆంధ్రాకు చెందిన రైతులు ఇక్కడి రైతులను నమ్మబలుకుతున్నారు. అనంతరం నకిలీ పత్తి విత్తనాలు అంటగడుతున్నారు. ఈ ఘటన శుక్రవారం కామారెడ్డిగూడెంలో వెలుగులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడుకు చెందిన చందుపాటు రామారావు మండలంలోని కామారెడ్డిగూడెంలో వ్యవసాయ భూమి కౌలుకు తీసుకొని పత్తిసాగు చేస్తున్నాడు.ఈ క్రమంలో ఇక్కడి రైతులతో సన్నిహిత్యం పెంచుకొని పలు పేరుమోసిన కంపెనీల నుంచి ప్యాకింగ్ అయ్యే వచ్చే విత్తనాలు ఇవేనని నమ్మబలికి దేవరుప్పుల, కామారెడ్డిగూడెంలో నకిలీ విత్తనాలు అమ్ముతున్నాడు. ఆంధ్రాలోని జిన్నింగ్ మిల్లుల్లో పత్తిలో తీసిన విత్తనాలను శుద్ధి చేసి ఇక్కడ రంగులద్ది కిలో రూ. వేయి చొప్పున విక్రయిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న వ్యవసాయ అధికారులు కామారెడ్డిగూడెంలో నకిలీ పత్తి విత్తనాలతో ఉన్న చందుపాటి రామరావుతోపాటు స్థానికుడు మరాటి యాదిగిరిని అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ పాలకుర్తి ఏడీఏ పరశురామ్‌నాయక్, ఇన్‌చార్జి ఏఓ రాజు, ఏఈఓ సాగర్, హెచ్‌సీ సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన ఉండాలి

● ముల్కనూర్ సొసైటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి
● వరంగల్ ఏఆర్ఎస్‌లో రైతు సదస్సు ప్రారంభం

కరీమాబాద్: ప్రస్తుత పరిస్థితులలో రైతులు ఆధునిక వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకోవాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే, ములుకనూరు సొసైటీ అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. వరంగల్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో అసోచం ఆధ్వర్యంలో మూడు రోజులు జరుగనున్న టీఎస్ అగ్రిటెక్ రైతు సదస్సును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి అసోచం అడిషనల్ డైరెక్టర్ దినేశ్ అధ్యక్షత వహించగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ లాభసాటి వ్యవసాయం కోసం రైతులు మారుతున్న కాలానికనుగుణంగా పంటలు సాగు చేయాలన్నారు. వరంగల్ ఏఆర్ఎస్ అసోసియేట్ డైరెక్టర్ ఉమారెడ్డి మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి విధానాన్ని పాటించాలన్నారు.అలాగే, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన ఉండాలన్నారు. మోతాదుకు మించి పురుగుమందులు వాడొద్దని సూచించారు. కోరమండల్ జీపీ సుబ్బారెడ్డి, శాస్త్రవేత్త బలరాం, జేడీఏ ఉషాదయాల్, డీఏవో రవీందర్ పాల్గొన్నారు.

ముగ్గురు బైక్ దొంగల అరెస్టు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న మైనర్‌తోపాటు ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు క్రైమ్ ఏసీపీ డేవిడ్‌రాజ్ తెలిపారు. వారినుంచి రూ.2.75 లక్షల విలువగల మూడు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని దీన్‌దయాల్‌నగర్ చెందిన బాలుడితోపాటు విసునూటి రవీందర్ అలియాస్ బబ్లూ, అలుగు నరసింహారావులు జల్సాల కోసం దొంగతనాలు చేస్తున్నారు. బాలుడు గతంలో పద్మాక్షి దేవాలయంలో హుండీ పగులగొట్టి డబ్బుల చోరీకి పాల్పడ్డాడు.. నిందితులు హనుమకొండ, సుబేదారి పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు ద్విచక్ర వాహనాలను చోరీచేశారు. గత నెల 20న ములుగు జిల్లా , గోవిందారావుపేట మండలం మచ్చాపూర్ గ్రామ శివారు ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రోడ్డుపక్కన పడేసిన బైక్‌ను అపహరించారు. వీరిని శుక్రవారం హంటర్‌రోడ్డులోని రాజ్ హోటల్ పరిసరాల లో అరెస్ట్‌చేసినట్లు తెలిపారు.